సాక్షి అనకాపల్లి

బుధవారం । 24 । జనవరి । 2024



అభివృద్ధికి కార్పొరేట్ సహకారం

పరిశ్రమల సీఎస్‌ఆర్ నిధులతో కశింకోటను అభివృద్ధి చేశారు. పాఠశాల, హాస్టల్, కల్యాణ మండపాలు నిర్మించారు. 10లో



నేతాజీకి ఘన నివాళి

విశాఖ: ఏయూలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని విభాగాధిపతి షారోన్‌రాజు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 29.4 నుంచి 29.5, కనిష్టం 23.4 నుంచి 23.6 డిగ్రీలు. తేమ 76 నుంచి 77 శాతం, గాలి వేగం గంటకు 6 కి.మీ. ఉండవచ్చన్నారు.

న్యూస్‌రీల్

బ్రహ్మలింగేశ్వరుని సన్నిధిలో జస్టిస్ రవి



బ్రహ్మలింగేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న జస్టిస్ చీమలపాటి రవి దంపతులు

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కుటుంబ సభ్యులతో బలిఘట్టంలోని శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ప్రధానార్చకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి న్యాయమూర్తి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించుకున్నారు. ఆలయంలో న్యాయమూర్తి కొంతసేపు గడిపారు. హైకోర్టు న్యాయమూర్తికి స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్, అనదపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు, ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు జాబ్‌మేళా

మురళీనగర్: యువతకు ఉద్యోగ కల్పనకు ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దువ్వాడలోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమా మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ, ఐటీఐ, బీటెక్ లేదా ఎంటెక్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్, మెట్రాలజీ కోర్సులు పూర్తి చేసిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీ కార్యాలయానికి నేరుగా 9 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి వారి అర్హతను ఆధారంగా రూ.12,000 నుంచి రూ.20,000ల వరకు వేతనం చెల్లిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 9292553352 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

నైతిక విలువలు బోధించే నాయకత్వం అవసరం



గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: నైతిక విలువలు బోధించే నాయకత్వం కోసం యువత ఎదురుచూస్తోందని ఏయూ న్యాయ కళాశాల పూర్వ ఆచార్యుడు, డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాంధీజీ–జాతీయ సమైక్యత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథి విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ సంఘర్షణలు పరిష్కరించడానికి గాంధీజీ ఆలోచనలు ఉపకరించే విధానాలు వివరించారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు.

ఫిష్ ఆంధ్ర సూపర్





ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లు

- జిల్లాలో ఇప్పటికే 85 ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లు
- త్వరలో ప్రారంభం కానున్న నాలుగు సూపర్ షాప్‌లు
- సిద్ధమవుతున్న మరో రెండు లాంజ్‌లు

ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి.. అని చేపల ప్రియులు ఆస్వాదించే వార్త.. కష్టపడి వేటాడిన మత్స్యసంపదకు చక్కని మార్కెట్ లభించడంతో గంగపుత్రులు ఆనందించే సందర్భం..

జిల్లాలో ఇప్పటికే 85 ఫిష్ ఆంధ్ర మినీ ఔట్‌లెట్లను ప్రారంభించిన మత్స్యశాఖ.. త్వరలో నాలుగు సూపర్ షాప్‌లకు శ్రీకారం చుట్టనుంది. మరో రెండు లాంజ్‌లను ఏర్పాటు చేయనుంది. మినీ ఔట్‌లెట్లలో చేపలు విక్రయించగా.. కొత్తగా ప్రారంభించనున్న సూపర్ షాప్‌లలో లైవ్ ఫిష్‌తోపాటు చేపలతో తయారు చేసే వంటకాలను విక్రయిస్తారు. లాంజ్‌లు రెస్టారెంట్లుగా భోజన ప్రియులకు ఆతిథ్యమివ్వనున్నాయి.



ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్‌లో చేపలను పరిశుభ్రంగా కటింగ్ మిషన్‌తో ముక్కలుగా చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: మత్స్యకారులకు అండగా ఉంటూ.. మత్స్య సంపదను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటోంది. దీంతో వేలాదిమంది మత్స్యకారుల తలరాత మారుతోంది. అంతేకాకుండా ఆహారంలో కీలక పోషకాలు ఉన్న చేపల ఉత్పత్తి, అమ్మకాలకు మరిన్ని మంచి రోజులు వస్తున్నాయి. ఫిష్ ఆంధ్ర నినాదంతో ఇప్పటికే మినీ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉండగా.. అదనపు హంగులతో చేపల షాపులను ఏర్పాటు చేసే దిశగా ఆ శాఖ అడుగులు వేస్తోంది. జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తీరంలో ఉన్న ఆరు మండలాల పరిధిలో 31 మత్స్యకార గ్రామాలు, 12 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. సుమారు 11 వేల 116 మందికి పైగా మత్స్యకారులు జిల్లాలో ఉన్నారు. ప్రభుత్వ చర్యలతో చేపల వేటపై ఆధారపడిన వారికి మేలు చేకూరనుంది. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న మత్స్యసంపద మార్కెటింగ్‌కు సంబంధించి మరిన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో నాలుగు సూపర్ షాపులు

అన్ని గ్రామాలు, పట్టణాల్లో చేపల విక్రయానికి ఏర్పాటు చేస్తున్న ఫిష్ మినీ ఆంధ్ర షాపులు జిల్లాలో 85 ఉన్నాయి. దీంతో సముద్ర తీరప్రాంతాల్లోనూ, రిజర్వాయర్, నదులు, సరస్సులు, చెరువుల్లో లభించే వివిధ రకాల చేపలకు చక్కని మార్కెటింగ్ సదుపాయం దక్కింది. ఈ క్రమంలోనే జిల్లాలో సూపర్ షాపులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో షాపును నెలకొల్పేందుకు రూ.20 లక్షల పెట్టుబడి అవసరం. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీని భరిస్తుంది. ముందుగా అచ్యుతాపురంలో ఒక షాపును, చోడవరంలో మరో షాపును ఏర్పాటు చేయనున్నారు.

ఇక సూపర్ షాపులకు దీటుగా లాంజ్‌లను సైతం రూ.50 లక్షలతో జిల్లాలో రెండు ఏర్పాటు చేయనున్నారు. వీటిని అనకాపల్లి హైవేలో ఏర్పాటు చేయనున్నారు. వేల్యూ యాడ్ చేసి హైజనిక్‌గా చేపల విక్రయం చేపట్టనున్నారు. దిగువ స్థాయి ప్రజల నుంచి ఉన్నత స్థాయి వర్గాల వారికి అవసరమైన 10 రకాల చేపలు సూపర్, లాంజ్‌లలో దొరకనున్నాయి.

'సూపర్' ప్రత్యేకతలివే...

సముద్ర, చెరువు చేపలకు సంబంధించిన శీలావతి, పచ్చబోసు, సముద్ర రకాలు చందువ, కోనాలు, వంజరం వంటి చేపలను లైవ్‌లో అమ్ముతారు. ఇక్కడే ఐస్ తయారీ వ్యవస్థ ఉన్నందున చేపలు ఫ్రెష్‌గా ఉంటాయి. అవసరమైతే ప్యాక్ చేసిన చేపలను అమ్ముతారు. చేపల కట్‌లెట్‌లు, ఫ్రైలు విక్రయిస్తారు.

రెస్టారెంట్‌గా లాంజ్‌లు...

లాంజ్‌లు దాదాపు రెస్టారెంట్ తరహాలో ఉంటాయి. చేపలకు సంబంధించిన అన్ని వంటకాలు ఇక్కడ విక్రయిస్తారు. చేపల స్టార్టర్లు, పులుసులు, చేపల బిర్యానీ, చేపల అన్నం, చేపలతో కూడిన అన్ని రకాల ఆహార పదార్థాలను ఇక్కడ రెస్టారెంట్ తరహాలో వినియోగదారునికి అందిస్తారు.

అందుబాటులో విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులు



జిల్లాలో ఫిష్ మినీ ఆంధ్రాలకు తోడు మరో నాలుగు సూపర్ షాపులను ఏర్పాటు చేయనున్నాం. అచ్యుతాపురంలో ఒకటి, చోడవరంలో మరొకటి నెలకొల్పుతున్నాం. రూ.20 లక్షలతో ఏర్పాటు చేసే సూపర్ షాప్‌లతో ఫిషింగ్ వేల్యూ యాడ్ చేస్తాం. షాపు ఏర్పాటులో మత్స్యకారునికి 40 శాతం సబ్సిడీ ఇస్తాం.

–ప్రసాదరావు, జిల్లా మత్స్య శాఖ ఏడీ

మహిళలకు ఆర్థిక 'ఆసరా'



వైఎస్సార్ ఆసరా చెక్కు నమూనాను మహిళలకు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- జిల్లాలో 3,63,479 మందికి రూ.273.56 కోట్ల సాయం
- నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల
- మొత్తం డ్వాక్రా రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



మాకవరపాలెం మండలం తామరంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 'ఆసరా' లబ్ధిదారులు

తుమ్మపాల: మహిళా సాధికారత మెరుగుపరచి, పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా వారిని రుణ విముక్తులుగా చేయడం కోసం ఏటా నగదు జమ చేస్తుందన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం సీఎం జగన్ ప్రారంభించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయనతో పాటు అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జిల్లాలో 34,944 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,63,479 మంది మహిళలకు రూ.273 కోట్ల 56 లక్షలు వైఎస్సార్ ఆసరా నగదు నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, జీవనోపాధి కొనసాగే విధంగా ఆసరా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. నాలుగేళ్లగా అందించిన నగదుతోపాటు వివిధ పథకాల ద్వారా అందిన సొమ్ముతో వారికి నచ్చిన వ్యాపారాలు స్థాపించి విస్తరించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూడు విడతల్లో 3,63,479 మందికి రూ.819.38 కోట్లు జమ చేయగా, నాలుగు విడతతో కలిపి మొత్తం రూ.1092.94 కోట్లను అందించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి, ఏపీడీ డైజీ, మెప్మా పీడీ సరోజిని, డీపీఎంలు వరప్రసాద్, శ్రీనివాస్, కుమారస్వామి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అక్రమాలపై విచారణ జరపాలి

- ఉపాధి హామీ సోషల్ ఆడిట్ సమావేశంలో వీసం డిమాండ్

10లో

విశాఖ నుంచి బ్యాంకాక్‌కు విమాన సర్వీస్

- ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం

గోపాలపట్నం: విమాన ప్రయాణికులకు శుభవార్త. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు నేరుగా విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 16 నుంచి మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు ఎయిర్ ఏసియా ప్రకటించింది. బ్యాంకాక్‌లో రాత్రి 10.05 గంటలకు ఈ విమానం బయలుదేరి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. విశాఖలో 11.50 గంటలకు బయలుదేరి.. తెల్లవారుజాము 4.15గంటలకు(భారత కాలమానం ప్రకారం) బ్యాంకాక్ వెళ్తుంది. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు నేరుగా వెళ్లే వారికి ఈ విమాన సర్వీసు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పటివరకు విశాఖ నుంచి సింగపూర్‌కి మాత్రమే విదేశీ విమాన సర్వీసు అందుబాటులో ఉంది. బ్యాంకాక్ సర్వీసు మొదలైతే.. ఈ జాబితాలో మరో విదేశీ విమాన సర్వీస్ చేరుతుంది.

కలెక్టరేట్ ప్రతిపాదిత స్థలం పరిశీలన

తుమ్మపాల: నూతన జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలాల అన్వేషణ జరుగుతోంది. శంకరం గ్రామంలో సర్వే నెం.56లో గల ప్రభుత్వ భూమిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారికి సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో భవనాల నిర్మాణాలకు అనువైన స్థలంగా ఆర్కియాలజీ శాఖ నివేదించడంతో దాదాపు ఐదెకరాల భూమిని రెండు నెలల క్రితం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలతో రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు చదును చేశారు.

శాంతిభద్రతలకు పెద్దపీట



సీసీ కెమెరాల డిస్ ప్లే బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఎంపీ సత్యవతి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- అనకాపల్లిలో 40 సీసీ కెమెరాల ప్రారంభం

అనకాపల్లి: శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి నియోజకవర్గంలో నూతనంగా 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎంపీ బీవీ సత్యవతి, ఎస్పీ కేవీ మురళీకృష్ణలతో కలిసి ఆయన సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కొత్త జిల్లాలో ప్రజలకు ఎంతగానో ఉపకరించే విధంగా ఇవి వినియోగంలోకి రావడం అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గతంలో 24 సీసీ కెమెరాలు ఉండేవని, తాజాగా రూ.10 లక్షల ఎంపీ నిధులతో 17 ప్రధాన కూడళ్ల వద్ద 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నేరాల నియంత్రణకు ఈ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు. తక్కువ ఖర్చుతో నేరాల నియంత్రణకు ఇవి ఉపయోగపడతాయన్నారు. పరవాడ, అచ్యుతాపురం, పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయనున్నామన్నారు. జిల్లాలో 334 సీసీ కెమెరాలు ఉన్నాయని చెప్పారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం సీసీ ఫుటేజీల ద్వారా పర్యవేక్షిస్తూ ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగితే హుటాహుటిన పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకునేందుకు ఇవి ఉపకరిస్తాయన్నారు. విశాఖకు దీటుగా అనకాపల్లిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలు ఎక్కువగా రావడంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, డీఎస్పీ వి.సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, సీఐలు జి.శంకరరావు, పి.శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.7.5 కోట్లతో బొజ్జన్నకొండ అభివృద్ధి

- రూ.1.37 కోట్లతో పూర్తయిన సీసీ రోడ్డు
- ప్రారంభోత్సవంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



బొజ్జన్నకొండ రోడ్డు



బొజ్జన్నకొండ రోడ్డును ప్రారంభించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దిలీప్‌కుమార్

తుమ్మపాల: నూతన జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో పురాతన చరిత్ర, విశిష్టత కలిగిన బొజ్జన్నకొండకు పర్యాటక కేంద్రంగా విరాజిల్లేలా రూ.7.5 కోట్లతో పూర్తిస్థాయి మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో శంకరంలో బొజ్జన్నకొండ రోడ్డును ఎంపీ బీవీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. రెండు విడతలుగా పూర్తి చేసిన రెండు కిలోమీటర్ల మేర రోడ్డుపై నడిచి పరిశీలించారు. వీటి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో క్వారీ, క్రషర్ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమైన రోడ్డు అభివృద్ధికి ఎంపీ రూ.1.37 కోట్లు మంజూరు చేశారన్నారు. మొదట్లో బీటీ రోడ్డు వేసేందుకు ప్రణాళిక చేసినప్పటికీ దీర్ఘకాలంగా నిలిచిపోయేలా మరిన్ని అదనపు నిధులతో సీసీరోడ్డు నిర్మించామన్నారు. ఈ రోడ్డు చోడవరం, సబ్బవరం రహదారులపై వచ్చే వాహనాలు అనకాపల్లి పట్టణంలోకి అడుగు పెట్టకుండా ప్రత్యామ్నాయంగా ఉందన్నారు. దీని ద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉందన్నారు. క్వారీ, క్రషర్స్ ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకలు కారణంగా రోడ్డు ధ్వంసం కాకుండా రోడ్డుపై ఐరెన్ లాక్డ్ చానల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ అనకాపల్లికి మకుటాయమానంగా బొజ్జన్నకొండ ఉందని, దీని అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయడంతోపాటు మరింత అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో ఎంపీ నిధులతో రోడ్డు పూర్తి చేశామన్నారు. క్రమక్రమంగా పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మరిన్ని వన్నెలద్దే విధంగా లైటింగ్, బ్యూటిఫికేషన్ పూర్తి చేసి పర్యాటకులకు మంచి ఆహ్లాద వాతావరణంతోపాటు మానసిక ప్రశాంతత కలిగించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. భవిష్యత్ తరాలకు మంచి మార్గదర్శకం కావాలని ఆశిస్తున్నామన్నారు. సీఎం జగన్ ఆశీస్సులతో అతి త్వరలో అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. గత పాలకులు అభివృద్ధిని మరచి చేసిన విమర్శలకు ఇక్కడ అభివృద్ధే సమాధానం అన్నారు. మళ్లీ జగన్ సీఎం అయ్యే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

ఎవరి కోసమో సీఎంను కించపరచొద్దు..

సీఎం జగన్‌పై షర్మిల రాజకీయ విమర్శలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి అమర్‌నాథ్ సమాధానమిస్తూ.. వైఎస్సార్ బిడ్డగా, జగనన్న సోదరిగా, వ్యక్తిగతంగాను ఆమెపై తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. దయచేసి సీఎంను కించపరచే విధంగా రాజకీయ విమర్శలు చేయొద్దన్నారు. ఎవరికో ఉపయోగపడే విధంగా వ్యవహరించడంపై పునరాలోచన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, డాక్టర్ విష్ణుమూర్తి, రామమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో అద్భుత ఫలితాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ప్రగతి వికాసం
- కేంద్ర ప్రభుత్వ అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్



సేంద్రియ పంటలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న పీయూష్‌కుమార్



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న కేంద్ర ప్రభుత్వ అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్, జేసీ జాహ్నవి, ట్రెయినీ కలెక్టర్ స్మరణ్‌రాజు

ఎస్.రాయవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర ప్రభుత్వ అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ అన్నారు. ఎస్.రాయవరంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు జరిగే కార్యక్రమాలకు సంబంధించిన స్టాల్స్‌తో ప్రదర్శన ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీయూష్ కుమార్ మాట్లాడుతూ.. 2027 నాటికి దేశం అభివృద్ధిలో అగ్ర స్థానానికి చేరే దిశగా ప్రధాని నరేంద్రమోదీ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎస్.రాయవరంలో పలువురు లబ్ధిదారులు సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, వాటి ప్రయోజనాలను బాగా వివరించారని సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంలో పథకాలు ప్రజలకు అందిస్తే.. అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి జన్‌ధన్ పథకంలో ఆధార్ సహాయంతో ఒక్క రూపాయి అవినీతి జరగకుండా రాయితీలు అందించవచ్చన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కాసేపు ఉండి వేరే అత్యవసర కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెంటనే వెళ్లడంతో జాయింట్ కలెక్టర్ జాహ్నవి సభకు అధ్యక్షత వహించారు. పలువురు లబ్ధిదారులకు వికసిత్ భారత్ కార్యక్రమంలో విడుదలయిన గ్యాస్ కనెక్షన్, కిసాన్ కార్డులు అందించారు. ప్రిన్సిపల్ సెక్రటరీని ఆర్డీవో జయరాం, ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకరదేవి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందు, అప్పన్నలు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ స్మరణ్‌రాజు, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, డీపీవో శిరీష, మండల ప్రత్యేకాధికారి మహేష్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అపరాలు, చెరకులో సస్యరక్షణ చర్యలు

అనకాపల్లి : అపరాల పంటను చిత్త పురుగులు ఆశించే అవకాశముందని ప్రాంతీయ పరిశోధనాస్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(ఏడీఆర్) పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. (ఆర్ఏఆర్ఎస్)లో మంగళవారం వ్యవసాయ ఆధారిత సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పురుగు నివారణకు వేపనూనె 5 ఎం.ఎం. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి, నువ్వు పంట సాగు చేసే రైతులు వైఎల్ఎం 66 రకాన్ని ఎకరాకు 2 కిలోల విత్తనాన్ని కార్బెండిజమ్ 1 గ్రాము కిలో విత్తనానికి వాడి విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఎకరాకు 22 కిలోల యూరియా, 63 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నువ్వు పంట విత్తే సమయంలో వేసుకోవాలని సూచించారు. చెరకు కార్శి చేసుకునే రైతులు వీలైనంత త్వరగా పొలమంతా ఒకేసారి మోడు చెక్కి కార్శి చేసుకోవాలని తెలిపారు. కార్శి చేసిన తోటల్లో ముఖ్యంగా విశ్వామిత్ర వంటి రకాల్లో కొరడా తెగులు ఆశించే అవకాశమున్నందున ప్రాపికొనజోల్ 2 ఎం.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరరావు, రమణమూర్తి, కుమారి, ఆదిలక్ష్మి, విశాలాక్షి, శిరీష, చంద్రశేఖర్, అలివేణి పాల్గొన్నారు.

అభివృద్ధికి కార్పొరేట్ సహకారం

- మంత్రి, ఎంపీ చొరవతో విరివిగా నిధులు
- సీఎస్ఆర్ నిధులతో ముమ్మరంగా అభివృద్ధి పనులు



తాళ్లపాలెంలో అరబిందో పరిశ్రమ సహకారంతో అందంగా తీర్చిదిద్దిన కల్యాణ మండపం



కశింకోటలో లారస్ పరిశ్రమ సహకారంతో అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన సమగ్ర బాలికల వసతి గృహం

కశింకోట : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా కశింకోట మండలంలో పరిశ్రమల నిర్వాహకులు ముందుకు వచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సుమారు రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారు. ప్రజలు, విద్యార్థులు, రైతులకు సామాజిక సేవలందిస్తూ గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్నారు. పరిశ్రమలు తమకు వచ్చిన లాభాల్లో సీఎస్ఆర్ నిధుల నుంచి 2 శాతం మేర సేవా కార్యక్రమాలకు పరిశ్రమల చట్టం నిబంధనలను అనుసరించి ఏటా ఖర్చు చేయాల్సి ఉంది. అయితే గతంలో నామ మాత్రంగా సేవా కార్యక్రమాలు చేసి మమ అనిపించే వారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమల నిర్వాహకులు విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకు వచ్చారు. పరవాడ వద్ద ఉన్న అరబిందో ఫార్మాసిటీ పరిశ్రమ, లారస్, రామ్‌కో పరిశ్రమలు శాశ్వత ప్రాతిపదికన మండలంలో కల్యాణ మండపాలు, సంక్షేమ హాస్టల్ అభివృద్ధి, పాఠశాల భవనాల నిర్మాణం చేశాయి. కొత్త వాటిని కూడా నిర్మాణం చేపట్టాయి. తాళ్లపాలెంలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని సుమారు రూ.40 లక్షలతో అరబిందో ఫార్మా పరిశ్రమ తరఫున అభివృద్ధి చేశారు. 2004లో దీని పనులు ప్రారంభమయ్యాయి. నిధులు సరిపోకపోవడంతో అసంపూర్తిగా నిలిచి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో అరబిందో పరిశ్రమ ముందుకు వచ్చి కల్యాణ మండపాన్ని ఆధునిక హంగులతో పూర్తి చేసి ఇటీవల ప్రారంభించి అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీంతో వాటిలో శుభ కార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఇదే పరిశ్రమ ఆధ్వర్యంలో కశింకోటలోని పంచాయతీ కార్యాలయం ఎదుట స్థలంలో రూ.కోటి పైబడి ఖర్చు చేసి పెద్ద కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఉగ్గినపాలెంలో కూడా అసంపూర్తిగా ఏళ్ల తరబడి ఉన్న కల్యాణ మండపాన్ని కూడా తాజాగా రూ.30 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు.దీని పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి.

వెదురుపర్తిలో స్కూలు భవనం

వెదురుపర్తి హైస్కూల్లో గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న పరిస్థితిలో ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి పర్యటనలో ప్రజలు ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. ఆమె చొరవ తీసుకొని ఏఎస్‌పేట వద్ద ఉన్న రామ్‌కో పరిశ్రమ ముందుకు రావడంతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో సుమారు రూ.70 లక్షలు వెచ్చించి 5 తరగతి గదులను నిర్మించారు. విద్యార్థులకు బాత్‌రూంలను కూడా నిర్మించారు. బయ్యవరంలో సాగునీటి పెద్ద చెరువును రూ.20 లక్షలు ఖర్చు చేసి అచ్యుతాపురం వద్ద ఉన్న ఏషియన్ పెయింట్స్, అంబుజా సిమెంట్ పరిశ్రమల సహకారంతో అభివృద్ధి చేశారు. మంత్రి, ఎంపీల ప్రోత్సాహంతో వీటిని నిర్వహించారు.

సమగ్ర బాలికల వసతి గృహం అభివృద్ధి

పరవాడ వద్ద ఉన్న లారస్ పరిశ్రమ తరఫున కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహాన్ని సుమారు రూ.35 లక్షలతో అభివృద్ధి చేశారు. జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి చొరవతో లారస్ పరిశ్రమ నిర్వాహకులు ముందుకు వచ్చి దాదాపు అన్ని సౌకర్యాలు కల్పించి అందంగా తీర్చిదిద్దారు. దీంతో సదుపాయాలు మెరుగుపడి సౌకర్యవంతంగా ఉండటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభినందనీయం



తాళ్లపాలెంలో కల్యాణ మండపం లేదు. శుభకార్యాలు జరిపించుకోవాలంటే తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో అరబిందో పరిశ్రమ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావడం ఎంతో ఆనందదాయకంగా ఉంది

–మట్టా సత్తిబాబు, తాళ్లపాలెం

ఆనందంగా ఉంది



కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లారస్ పరిశ్రమ సహకారంతో అన్ని సదుపాయాలతో అందంగా తీర్చిదిద్దారు. దీంతో సౌకర్యాలు మెరుగుపడి తమ ఇబ్బందులు తొలగాయి. ఎంతో ఆనందంగా ఉంది.

–బండారు సంధ్య, విద్యార్థిని, సమగ్ర బాలికల వసతి గృహం, కశింకోట

ఇబ్బందులు తొలగాయి



వెదురుపర్తి గ్రామ హైస్కూల్లో తగిన తరగతి గదులు లేక ఇబ్బంది పడే వారం. ఈ నేపథ్యంలో రామ్‌కో పరిశ్రమ ముందుకు వచ్చి ఐదు తరగతి గదులతో కూడిన భవనాన్ని నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. నాలుగు టాయిలెట్లను కూడా అందుబాటులోకి తెచ్చారు. సదుపాయాలు మెరుగుపడి ఇబ్బందులు తొలగాయి.

–కాండ్రేగుల బాలు, విద్యార్థి, వెదురుపర్తి

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో ఖాళీగా వున్న యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగా గురువు పోస్టుకు ఆసక్తి గల అనుభవం కలిగిన స్త్రీ, పురుష, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. యోగాలో పీజీ లేదా డిప్లొమా చేసిన వారు అర్హులని తెలిపారు. నెలలో పురుషులకు 32 గంటలు, మహిళలకు 20 గంటలు పని దినాలు నిర్ణయించామని. పురుషులకు రూ.8వేలు, మహిళలకు రూ.5వేలు జీతం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 9849530266 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ నెల 24 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పక్కదారి పడుతున్న ఉచిత ఇసుక

- డిపో వద్ద ట్రాక్టర్ యజమానుల హల్‌చల్
- డిపో నిర్వాహకులతో వాగ్వాదం



ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్ యజమానులు, లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

నక్కపల్లి : జగనన్న కాలనీల్లోను, సొంత స్థలాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు నిర్మించుకునేవారికి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న ఇసుక పక్కదారి పడుతోంది. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపో వద్ద మంగళవారం ట్రాక్టర్ యజమానులకు, లబ్ధిదారులకు, డిపో నిర్వాహకులకు మధ్య వాగ్వాదం జరిగింది. లబ్ధిదారులు క్యూలో నిలుచుని ప్రభుత్వం ఇచ్చిన కూపన్ల ద్వారా ఇసుక తీసుకెళ్లేందుకు వేచి ఉండడంతో వారితో పాటు, డిపో నిర్వాహకులపై కొంత మంది ఇసుక మాఫియా, ట్రాక్టర్ యజమానులు వాగ్వాదానికి దిగారు. దీనిపై డిపో నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. నక్కపల్లి డిపో వద్ద నిల్వ ఉంచిన ఇసుకను కేవలం గృహనిర్మాణ లబ్ధిదారులకు మాత్రమే సరఫరా చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీచేసింది. ఈ డిపో నుంచి టన్ను ఒక్కంటికి రూ.1400 చెల్లించి ఎవరైనా కొనుగోలు చేసే అవకాశం ఉండేది.కానీ ఈ దఫా కేవలం ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు మాత్రమే డిపో నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి లబ్ధిదారుకు ఐదుటన్నుల విలువైన నాలుగు కూపన్లు అందజేస్తున్నారు. కూపన్లను లబ్ధిదారుల నుంచి చౌకగా కొనుగోలు చేసి తమకే ముందు లోడింగ్ చేయాలంటూ ట్రాక్టర్ యజమానులు ఒత్తిడి చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ తాము కూపన్లు కొనుగోలు చేయడం లేదని, లబ్ధిదారులు ఇక్కడకు వచ్చే పరిస్థితి లేక ట్రాక్టర్ అద్దె , చెల్లిస్తామని కోరితే కూపన్లతో ఇసుక కోసం డిపో వద్దకు వస్తున్నామని చెబుతున్నారు. ఒకేరోజు లబ్ధిదారులకు ఇవ్వాల్సిన 20 టన్నుల ఇసుక సరఫరా చేసేందుకు నిర్వాహకులు ఒప్పుకోవడం లేదని దీనిపైనే తాము నిలదీస్తున్నామన్నారు. ఈ వివాదంపై సమాచారం అందడంతో ఎస్ఐ విభీషణ్‌రావు తమ సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. లబ్ధిదారులు తాము సూచించిన వారికి కూపన్లు ఇస్తే వారి అంగీకారం మేరకు సరఫరా చేయాలన్నారు. టోకెన్లు జారీ చేసి ప్రాధాన్యతా క్రమంలో లోడింగ్ చేయాలన్నారు. క్యూలో నిలుచున్న లబ్ధిదారులకు ముందుగా ఇసుక ఇవ్వాల్సిందేనన్నారు. ఇసుక తీసుకెళ్లే ట్రాక్టర్ వద్ద అన్ని ఆధారాలు లబ్ధిదారుల వివరాలు ఉండాలన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అక్రమాలపై విచారణ జరపాలి

- ఉపాధి హామీ సోషల్ ఆడిట్ సమావేశంలో వీసం డిమాండ్



గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకు వస్తున్న వీసం

నక్కపల్లి: గత ప్రభుత్వ హయాంలో మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు చెల్లించిన ఆర్థిక సాయం , బీమా పరిహారంలో అనేక అక్రమాలు జరిగాయని వీటన్నింటిపై విచారణ జరపాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అధికారులను కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో త్వరలో ప్రారంభం కానున్న ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్‌పై స్థానిక సంస్థల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఉపాధి హామీ పథకంలో ఖర్చు చేసిన నిధులపై ఆడిట్ చేసేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఆడిట్ బృందం సభ్యులను సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వీసం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల బీమా ప్రీమియం చెల్లింపు, ఆర్థిక సాయం తదితర అంశాల్లో అనేక అక్రమాలు జరిగాయన్నారు. అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. సోషల్ ఆడిట్‌లో గ్రామాల వారీగా ఈ అక్రమాలపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ సూర్యనారాయణ మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నక్కపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన నిధులు, చేసిన పనులు, సామాజిక భద్రతా పథకం కింద పంపిణీ చేస్తున్న పింఛన్లపై గ్రామాల వారీగా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. నక్కపల్లి మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.15.61 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. కూలీలకు వేతనాల రూపంలో రూ.13,68,45,521 చెల్లించామన్నారు. ఈ పథకం కింద పనులకు హాజరైన కూలీలకు రూ.272 చెల్లించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తనిఖీల సందర్భంగా పనులకు హాజరు కాకుండా తమ పేరున వేతనాలు డ్రా చేసినా, పింఛన్లు అందకపోయినా పనులు చేయకుండా చేసినట్టు నిధులు దుర్వినియోగం అయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏపీవోలు ఈశ్వరరావు, భాగ్యలత, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సాదిరెడ్డి శ్రీను, సురేష్ వర్మ, రత్నకుమారి, వెంకటేష్, శ్రీనివాస్.ఎంపిటీసీలు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు పాల్గొన్నారు.

ఇగ్నోలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆధ్వర్యంలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీ డిసిప్లినరీ కోర్సుగా ఇగ్నో ఈ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును అందిస్తుందని తెలిపారు. నాలుగేళ్ల ఈ డిగ్రీ కోర్సులో ఎనిమిది సెమిస్టర్లు, 180 క్రెడిట్లు ఉంటాయని పేర్కొన్నారు. మల్టీ డిసిప్లినరీ విధానంలో అందిస్తున్న ఈ కోర్సులో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో అన్ని స్పెషలైజేషన్ సబ్జెక్టుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బస్సుల్లో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి నగరం వైపు ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్న గంజాయి రవాణాకు మంగళవారం పెందుర్తి పోలీసులు చెక్ పెట్టారు. వేర్వేరు బసుల్లో గంజాయి తరలిస్తున్న మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసి.. వారి నుంచి 31 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. అరకు ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్సుల్లో గంజాయి తరలిస్తున్నట్లు పెందుర్తి పోలీసులకు సమాచారం అందింది. దీనిపై పెందుర్తి మండలం సరిపల్లి వద్ద సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసుల నిఘా ఉంచారు. ఒక ఆర్టీసీ బస్‌లో 8 కిలోల గంజాయిని తరలిస్తున్న నిందితులు ఆరుముగం నారాయణ్, ఆర్య సోమయాజుల సాయి, మణి నంద కుమార్‌లను, మరో బస్‌లో 23 కిలోల గంజాయిని తరలిస్తున్న చుంచు రాజు, షాహూ, సునీష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

టీడీపీ నేత బెదిరింపు ఫోన్ కాల్‌పై విలేకరి ఫిర్యాదు



ఎస్ఐ ధనుంజయ్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటరావు

కె.కోటపాడు : ఈ నెల 17న ప్రజాశక్తి పత్రికలో వచ్చిన వార్తపై మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్ తనను అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడని విలేకరి శిలపరశెట్టి వెంకటరావు మంగళవారం కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటువంటి వార్తలు ఇకపై ప్రచురిస్తే ఊరుకునేది లేదని, నీ అంతు చూస్తానని హెచ్చరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌కాల్ రికార్డింగ్ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదును చేసినట్టు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా వార్తలు రాసే విలేకరులపై బెదిరింపులకు పాల్పడడం భావ్యం కాదని, ఇటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని చోడవరం ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎం నాయుడు, నేమాల సతీష్ అన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట



రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు

చోడవరం : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల నంద్యాలలో 37వ రాష్ట్రస్థాయి జూనియర్ క్యొరుగి, 12వ సబ్‌జూనియర్ పూమ్‌సే, ఉమెన్స్ ఖేలో ఇండియా సెలక్షన్స్ జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చోడవరం, అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు చెందిన తైక్వాండో క్రీడాకారులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఎ.చార్విక్ (అనకాపల్లి), ఫాతిమునిషా (గాజువాక), శివ కార్తికేయ (చోడవరం) బంగారు పతకాలు సాధించారు. ఖేల్ ఇండియా సెలక్షన్‌లో జూనియర్స్ విభాగంలో డి.జాహ్నవి (చోడవరం) బంగారు పతకం సాధించారు. పూమ్‌సే పోటీల్లో కె.తన్విత్ ఉదయ్, జశ్వంత్, ఎస్. సంతోష్, టి. మోహిత్ రజతపకతాలు సాధించారు.ఎ. సహస్ర, వై. జ్యోత్స్న, ఇషిత శారద కాంస్య పతకాలు సాధించారు. క్యొరుగి పోటీల్లో టి. చన్మయశ్రీ, సుదర్శన్ సాయి కాంస్య పతకాలు సాధించారు. ఖేల్ ఇండియా సెలక్షన్ కెడెట్ డివిజన్‌లో బి.ఎస్.ఎస్ అంజని ప్రియ, మేఘన, భువనేశ్వరి రజత పతకాలు, వి.రోజిలి, ఎం.హేమశ్రీ కాంస్య పతకాలు సాధించారు. వీరితోపాటు సబ్ జూనియర్స్‌లో 23 మంది క్రీడాకారులు మెడల్స్ సాధించారు. సబ్ జూనియర్స్‌లో ఉత్తమ మెడల్స్ సాధించిన క్రీడాకారులు ఫిబ్రవరి 2వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలో పాల్గొంటారని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పల్లం మురళి తెలిపారు. అదేవిధంగా ఖేల్ ఇండియా సెలక్షన్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు ఫిబ్రవరి10న పుదుచ్చేరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అంతా అభినందించారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి



మృతి చెందిన నాగమణి, బయ్యవరం వద్ద బోల్తా పడిన ఆటో

కశింకోట : మండలంలోని బయ్యవరం వద్ద మంగళవారం ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందింది. మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. సీఐ ఎం. వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం..యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఆటో బయ్యవరం వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న యలమంచిలి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన చలంశెట్టి నాగమణి(53) అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన ఆటోలో ప్రయాణిస్తున్న గలలక్ష్మి, బుద్దపు సత్యవతి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నాగమణి మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

నేడు గౌరమ్మ సారె ఊరేగింపు

అనకాపల్లి: గవరపాలెంలో బుధవారం గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం, సారె ఊరేగింపు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు తెలిపారు. ఉదయం 8 గంటలకు కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపిస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారికి సమర్పించే సారె ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ రకాల పిండి వంటకాలతో సారె ఊరేగింపు సతకంపట్టు, మునసబు గారి వీధి, పెద రామస్వామి కోవెల, మెయిన్‌రోడ్డు, పార్క్ సెంటర్, వెంకన్న కొట్టు జంక్షన్ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని తెలియజేశారు. అనంతరం సారెను అమ్మవారికి నివేదించి, భక్తులకు అందజేస్తామని పేర్కొన్నారు.

29న గణపతి హోమం

అనకాపల్లి: మండలంలోని బట్లపూడి పంచాయతీ పరిధి నాయుడుపేట గ్రామంలోని సోహం ఆశ్రమంలో ఈ నెల 29న సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకుడు కాండ్రేగుల రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు పూజాసామగ్రితో పాటు, ఆవునెయ్యి తీసుకురావాలని సూచించారు.

దశల వారీగా అభివృద్ధి

- తుమ్మపాల గ్రామసభలో సర్పంచ్ పెంటయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న తట్టా పెంటయ్యనాయుడు

అనకాపల్లి: తుమ్మపాల గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన 2024–25 గ్రామ పంచాయతీ బడ్జెట్ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి 20లక్షల నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. వచ్చే ఏడాదికి (2024–25) రూ. సుమారు రూ.2 కోట్లు అంచనా బడ్జెట్ వేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ పనులతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు సభ తీర్మానం చేసిందన్నారు. సమావేశంలో అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు
మంగళవారం 4,816 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,760	4,400
మొదటి రకం	3,630	4,100
రెండో రకం	3,530	3,740
మూడోరకం	3,200	3,520

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
గుంటూరు కారం	: సత్యనారాయణ స్క్రీన్-1
హనుమాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డీసాయి
సైంధవ్	: పర్తిసాయి
గుంటూరు కారం(రెండు షోలు)	
హనుమాన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 86 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-17 యూనిట్లు, ఓ పాజిటివ్-55 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 474 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 411 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.



ఉగ్గినపాలెంలో రుణమాఫీపై సంతోషం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి, స్వయం సహాయక సంఘాల మహిళలు



తేగాడలో ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు



ఏఎస్ పేటలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు సారథ్యంలో..



చింతలపాలెంలో సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళలు

'ఆసరా' భరోసా

ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని స్వయం సహాయక సంఘాల మహిళలు వేనోళ్ల కీర్తించారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే తమ రుణాలు సీఎం మాఫీ చేసినందుకు వారంతా ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. సీఎం అందజేసిన ఆసరాతో తమ జీవనోపాధి మెరుగు పడిందని అన్నారు. మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన ఆసరా నగదు బదిలీ కార్యక్రమాన్ని పలు చోట్ల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు.

- మండలంలో రూ. 53 కోట్ల మేర రుణమాఫీ
- సంతోషం వ్యక్తం చేసిన స్వయం సహాయక సంఘాల మహిళలు

కశింకోట : ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా కింద రుణాలు మాఫీ చేసి తమను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వయం సహాయక సంఘాల మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగో విడత రుణమాఫీ ప్రత్యక్ష నగదు బదిలీ కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగ్గినపాలెం, తేగాడ, కొత్తపల్లి, ఏఎస్ పేట, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని ప్రాంతాలకు చెందిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించి అవగాహన కలిగించారు. ఈ సమావేశాల్లో వారంతా తమ సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మాట నిలుపుకున్న సీఎం..

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మాట నిలుపుకున్నారని కొనియాడారు. స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకంతో రుణమాఫీ చేశారన్నారు. ఇప్పటికే మూడు విడతలుగా మండలంలోని 1517 సంఘాల సభ్యులకు సుమారు రూ.40 కోట్ల మేర రుణమాఫీ చేశారన్నారు. తాజాగా రూ.13.27 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. దీంతో నాలుగు విడతలు కలిపి 53 కోట్ల రూపాయలకు పైగా మండలంలో రుణమాఫీ జరిగిందన్నారు. వెలుగు సిబ్బంది సహకారంతో మాఫీ ద్వారా వచ్చిన నగదును బ్యాంకు ఖాతాల నుంచి పొందాలన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని కోరారు. స్వయం సహాయక సంఘ సభ్యుల జీవితాలు మెరుగుపరిచేందుకు ఐటీసీ, అమూల్, పి అండ్ జి తదితర దిగ్గజ పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్గినపాలెంలో వైఎస్సార్ ఆసరా నగదు బదిలీ ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీల్లో ప్రదర్శించగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆనందంగా వీక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, సర్పంచ్‌లు నీటిపల్లి ఈశ్వరమ్మ, శ్యాం, కొట్టి రాము, కోన అరుణ, ఎంపీటీసీ సభ్యులు మంగతాయారు, ఏపీవో ఎస్. శ్రీనివాసరావు, వీవోఏలు పద్మావతి, వాణిశ్రీ, మంగ, చిన పాప, దేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉగ్గినపాలెంలో సీఎం జగన్ ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు



జెట్టపురెడ్డితునిలో మహిళల ఆనందోత్సాహం

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

అనకాపల్లి: రాష్ట్రప్రజల ఆరోగ్యంపై సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ కనబరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. పేదలకు మరింత వైద్యసేవలను మరింత చేరువ చేస్తూ చర్యలు చేపట్టారన్నారన్నారు. కోట్నివీధి సచివాలయ పరిధిలో 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేలా గతంలో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఆరోగ్యశ్రీ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి కొత్త ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న జానకీరామరాజు

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో మిరియాల కాలనీ సచివాలయం పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్సీ సుర వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, కంటి వైద్యుడితో పాటు వైద్యసిబ్బంది హాజరవుతారని పేర్కొన్నారు.

రహదారి అభివృద్ధి పనుల పరిశీలన

అనకాపల్లి: జాతీయ రహదారి జలగలమదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గతంలో రహదారి శిథిలావస్థకు చేరడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడేవారన్నారు. వారి కష్టాలకు చెక్ పెడుతూ రహదారి విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. సెంటర్ మీడియన్ డివైడర్, విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కేంద్రానికి కావలసిన మౌలిక సదుపాయాలను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, డీఈ ఇ.వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పీలా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న కొణతాల నీలిమ

హీమోఫీలియా రోగులకు వార్డు ఏర్పాటు చేయాలి

అనకాపల్లి : హీమోఫీలియా రోగులకు ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయాలని సొసైటీ అధ్యక్షురాలు ఎం.లీలావతి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు మంగళవారం ఆమె వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 70 మంది చిన్నారులు హీమోఫీలియా వ్యాధితో బాధపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఒక్కొక్క చిన్నారికి వారానికి రెండు సార్లు రక్తం ఎక్కించవలసి ఉంటుందని, ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌కు వెళ్తున్నారని తెలిపారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఒక్కొక్క రోగికి నెలకు రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు డాక్టర్ జి.రామ్మూర్తి, మునూరు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రోగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న లీలావతి

ముగ్గురికి జైలుశిక్ష

కశింకోట : మండలంలోని జి.భీమవరంలో మోటారు సైకిల్ దొంగిలించిన కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు 16 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ మంగళవారం అనకాపల్లి న్యాయస్థానం మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. 2020 జనవరి 27న జి.భీమవరంలో ఒడిశాకు చెందిన శుభాల గలారి, శుభాస్ గడారి, అబల భరోక్‌లు మోటారు సైకిల్ దొంగలించారు. ఈ మేరకు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అక్కడ వాదోపవాదాలు ముగిసి తుది తీర్పు రావడంతో జైలు శిక్ష విధించినట్లు సీఐ ఎం.వినోద్ బాబు తెలిపారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

అనకాపల్లి: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సుభాష్ చంద్రబోస్ యువతకు స్ఫూర్తిప్రదాత అని అబ్దుల్ కలాం సేవాసంస్థ వ్యవస్థాపకుడు అళ్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకుని స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్‌లోని బోస్ విగ్రహానికి మంగళవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్, సంఘం సభ్యులు ముగడ అప్పారావు, కోయిలాడ నాగు, నందవరపు కుమార్, సరిసా శ్రీను, ఆడారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ధీశాలి నేతాజీ

కశింకోట: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని కశింకోటలోని పోస్టాఫీసు వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ×అజాద్ హింద్ ఫౌజ్¶ సంస్థను స్థాపించి, సైనికులకు శిక్షణ ఇచ్చి బ్రిటీష్ వారిపై యుద్ధాన్ని ప్రకటించిన ధీశాలి నేతాజీ అని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత దేశానికి సేవ చేయాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కశింకోట ప్రఖండ్ అధ్యక్షుడు శిష్టి అప్పారావు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, బీజేపీ నాయకులు ఎం.ఎం. నాయుడు, జె. హరనాథ్, తిరుచోళ్ల రామకృష్ణ, నడిపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

అనకాపల్లి: భూహక్కు చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ అన్నారు. స్థానిక న్యాయ సముదాయం ముందు న్యాయవాదుల దీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి, మాట్లాడారు. ఈ చట్టం ద్వారా ప్రజలకు హాని కలగనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం న్యాయవాదులతో చర్చలు జరిపి చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎనిమిది మందికి కంటి ఆపరేషన్లు

అనకాపల్లి: స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో ఎనిమిది మందికి వైద్యుడు కె.మల్లీశ్వరరావు నేత్ర శస్త్రచికిత్సలు నిర్వహించారని ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో సోమవారం నిర్వహించిన శిబిరానికి 36 మంది హాజరు కాగా వారిలో 8 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారన్నారు. వారికి మంగళవారం శస్త్రచికిత్స చేసి, ఉచితంగా మందులు అందించామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు మందులు అందిస్తున్న వైద్యులు మల్లీశ్వరరావు, రవిరాం జవహర్

పెన్షనర్ల సమస్యలపై 25న ధర్నా

అనకాపల్లి: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 25న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు వి.జగన్నాథరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు పెన్షనర్లందరూ హాజరు కావాలని కోరారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

నక్కపల్లి : ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ రవిపటాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీలకు నిర్వాహకులుగా తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్ ఆచార్యులు వ్యవహరించారన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యాన్ని ప్రతి పౌరుడు గుర్తించాలన్నారు. దృఢ ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పడానికి ఎటువంటి నాయకులను ఎన్నుకోవాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. తెలుగు పండిట్ ఆచార్యులు మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద దేశాల్లో భారత్ ఒకటని, ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని శాసించే శక్తిమంతుడు ఓటరు అన్నారు. అంతటి విలువైనది కావడంతో ప్రతి పౌరుడు ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలన్నారు. ఈ పోటీల్లో పెద బోదిగల్లం ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ సిరాజ్‌నిషా ప్రథమ స్థానంలోను , నక్కపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి నరసింహాచార్యులు ద్వితీయ స్థానంలోను నిలిచారన్నారు. వక్తృత్వ పోటీల్లో స్థానిక హైస్కూలు విద్యార్థి షర్మిల ప్రథమ స్థానం, నరసింహాచార్యులు ద్వితీయ స్థానంలోను నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాణి లలిత, ఎన్నికల డీటీ తాతాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ బంగారు పాప, ఉపాధ్యాయులు సత్యవతి, టి.వి.రమణ పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలు పరిశీలిస్తున్న ఎంఈవో నరేష్

జగనన్న సురక్షతో ప్రజలకు ధీమా

అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ధీమా లభించిందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో కొత్తూరు సచివాలయంలో మంగళవారం మలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొలి, మలి విడతల్లో జరుగుతున్న ఈ వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పల్లె చెంత ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. శిబిరాల్లో అనుభవజ్ఞులైన వైద్యులు ప్రజలకు చక్కటి సేవలందిస్తున్నారని అన్నారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైద్యులు బీపీ పరీక్షించారు. శిబిరంలో వైద్యులు నేత్ర, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అంతకు ముందు పలువురికి ఆయన ఆరోగ్యకార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సర్పంచ్ సప్పారపు ప్రసన్నలక్ష్మి, వైస్ సర్పంచ్ అనపర్తి శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



శిబిరంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న సూరిబాబు

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: ఎటువంటి లాభాపేక్ష లేకుండా పేదలకు సేవలందిస్తున్న విఘ్నపతి సేవా సంస్థ కృషి అభినందనీయమని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. విఘ్న గణపతి సేవా సంస్థ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అలంక ప్రకాశరావు, అనకాపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, మాజీ ఎంపీటీసీ సుధారాణి, వైఎస్సార్‌సీపీ నేతలు సూరిశెట్టి కన్నారావు, దాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నల్లమారమ్మ జాతరకు పోటెత్తిన జనం

యలమంచిలి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన నల్లమారమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. బాణసంచా వెలుగులు, నృత్య ప్రదర్శనలు, మహిళల కోలాటాలు, తప్పెట గుళ్లు, సాము గరిడీలు, చెట్టు భజనలు, నేల వేషాలు, బంధుమిత్రుల సందడి.. వెరసి అమ్మవారి జాతర సందర్భంగా షేక్‌ల్లపాలెం జన సంద్రంగా మారింది. నల్లమారమ్మ తల్లిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఊపందుకున్న రబీ వరిసాగు

మునగపాక: మండలంలోని పలు ప్రాంతాల్లో రబీ వరి సాగు ఊపందుకుంది. మండల వ్యాప్తంగా వరి సాధారణ విస్తీర్ణం 97 హెక్టార్లు కాగా ఇంతవరకు 15 ఎకరాలకు పైగా వరి సాగు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు అందుబాటులో ఎరువులు,విత్తనాలు మరో వైపు వాతావరణం అనుకూలించడంతో రైతులు రబీలో వరిసాగుకు సమాయత్తమవుతున్నారు. వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో కొన్ని చోట్ల వరి ఉడుపులు ప్రారంభం కాగా మరికొన్ని ప్రాంతాల్లో ఉడుపులకు సంబంధించిన పనులు ముమ్మరం అవుతున్నాయి. సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



వాడ్రాపల్లిలో రబీ వరి సాగు

అర్హులందరికీ పథకాలు

సబ్బవరం: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ శాశ్వతమైనవని, వాటిని ఎవరూ తొలగించలేరని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు అన్నారు. మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఉప సర్పంచ్ మంగునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో రామునాయుడు మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోకుండా ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే లక్ష్యంతో వికసిత భారత సంకల్ప యాత్రలు చేపట్టి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులందరికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు నెలకొల్పి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీసీ మోర్చా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కంచిపాటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామునాయుడు

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి : ఉద్దండపురంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి స్వామివారికి ఆంజనేయ హోమాలు తమలపాకు పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో కోలాటాలు, భజనల, తప్పెటగుళ్ల, కాంతారా డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో పెద్ద తిరునాళ్లు జరిగింది. ఆలయంలో ఏకాహం ఏర్పాటు చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ కాసులమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు పాపారావు, మణిరాజు, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీలు బచ్చలరాజు, లొడగల చంద్రరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి తదితరులు దర్శించుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.